
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

ఆదివారం 9 జూన్ 2024

ఆదివారం ప్రత్యేకం

కంచి అనగానే మగువలకు గుర్తొచ్చేది అందమైన పట్టుచీరలు.ఇక్కడ తయారయ్యే పట్టు, బంగారు, వెండి, జరీ చీరలకు దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ . ఈ కంచిపట్టు చీరల తయారీ వెనుక నేతన్నల కష్టంతో పాటు పన్నికట్టు కళాకారుల సృజనాత్మకత కూడా దాగి వుంది.

పన్నికట్టు @ రామిరెడ్డి పాళెం







పన్ని తయారీకి ఉపయోగించే జొన్న దంటు, వెదురు పుల్లలు



- ప్రధాని ప్రశంసలందుకున్న పన్నికట్టు కళాకారులు
- కంచి పట్టుచీరల తయారీలో 'పన్ని' ప్రధాన భూమిక

సత్యవేడు, జూన్ 8 : కంచి పట్టుచీరల తయారీలో పన్ని అనే పరికరం ప్రధాన భూమిక పోషిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'పన్ని' లేనిదే కంచి పట్టు చీరల తయారీ కుదరదు. పొందూరు ఖాదీ తయారీలో 'వాలుగ చేప దవడ' పరికరం ఎంత ముఖ్యమో, కంచి పట్టుచీరల తయారీలో కూడా ఈ పన్ని అంతే ముఖ్యం. పట్టు వస్త్రాల తయారీలో నిలువు, అడ్డు పోగులను సరైన క్రమంలో అమర్చే పరికరం పేరే పన్ని. కంచి పట్టు చీరల తయారీకి అవసరమయ్యే 'పన్ని' మన రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లోనే తయారు చేస్తారు. ఒకటి నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు కాగా, రెండు మన జిల్లాలోని వరదయ్యపాళెం మండలంలోని రామిరెడ్డి పాళెం.ఈ రెండు ప్రాంతాల నుంచే కంచికి పన్ని సరఫరా అవుతోంది. జొన్నదంటు, వెదురు పుల్లలు చీల్చి తయారు చేసే ఈ పరికరాన్ని కంచి నేతన్నలకు సరఫరా చేస్తూ ఇక్కడి కళాకారులు జాతీయ ఖ్యాతి దక్కించుకున్నారు.బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని ఈ పన్నికట్టు కళను చూసి ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఇటీవల ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ కళాకారులను ప్రశంసించారు. వరదయ్యపాళెం మండలం రామిరెడ్డిపాళెంలో 30 కుటుంబాలు ఈ పన్నికట్టు మీదనే ఆధారపడి బ్రతుకుతున్నాయి.పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన ఈ కళను బ్రతికించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చేనేత కార్మికుల తరహాలో ప్రభుత్వాలు తమను ఆదరించక పోయినా నమ్ముకున్న ఈ వృత్తిని, అరుదైన ఈ కళను అంతరించి పోకుండా కాపాడుకుంటూ, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

ప్రధాని ప్రశంసలు

ఆజాదీకా అమృత మహోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన చేనేత రంగంలో దేశవ్యాప్తంగా నిష్ణాతులైన కార్మికులను కేంద్ర ప్రభుత్వం సన్మానించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత ఏడాది ఆగస్టు 7వ తేదీన జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో కేంద్ర ప్రభుత్వం రామిరెడ్డిపాళెం పన్ని కళాకారులను ఆహ్వానించి గౌరవించింది. గ్రామానికి చెందిన పన్ని కళాకారులు షేక్ బషీర్, షేక్ వహీద్ ఢిల్లీలోని ప్రగతి భవన్‌లో జరిగిన చేనేత ప్రదర్శనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి పన్ని తయారీ గురించి ప్రత్యక్షంగా వివరించి మన్ననలందుకున్నారు.

పన్ని తయారీ విధానం

తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి జొన్న దంటు, బుచ్చినాయుడు కండ్రిగ మండలం పెళ్కూరు నుంచి వెదురు పుల్లలు సేకరించుకుని బాగా ఎండబెడతారు. ఎండిన జొన్నదంటును మూడు నుంచి, మూడున్నర ఇంచీల లెక్కన సుమారు మూడువేల పుల్లలను సన్నగా చీల్చుకుంటారు.వీటిని గూటంలో పేర్చి పదునైన చిన్నపాటి కత్తులతో గరుకుల్లేకుండా మృదుత్వం వచ్చే వరకు చివ్వుకుంటారు. అనంతరం బాగా ఎండిన వెదురు పుల్లలను ఒకటిన్నర సెంటీమీటర్ మందంతో నాలుగు దబ్బలుగా చీల్చుకుంటారు. చీల్చిన దబ్బల నుంచి పైన రెండు దబ్బలు, కింద రెండు దబ్బలను మూడు అంగుళాల వెడల్పు పెట్టి ఒక ప్రత్యేక పరికరంలో అమర్చుకుంటారు. ఈ వెదురు దబ్బల సందుల్లోంచి, చీల్చిన జొన్నదంటు పుల్లలను ఒక్కొక్కటిగా పేర్చుకుంటూ దారంతో కడుతూ ముడి వేస్తారు. ఇలా మూడువేల జొన్నదంటు పుల్లలను కట్టి పన్ని తయారు చేస్తారు. ఒక్క పన్ని తయారు చేయాలంటే సుమారు రెండు రోజులు పడుతుంది. ఈ మొత్తం ప్రక్రియలో ఇంటిల్లిపాదీ సహనంతో పని చేయాల్సి ఉంటుంది. ఇంత చేసినా ఒక్క పన్ని విక్రయిస్తే వారికి దొరికేది రూ.వెయ్యికన్నా తక్కువే. అదే వారి కూలి, అదే లాభం కూడా.

అంతరించిపోతున్న అరుదైన కళ

పన్ని కళాకారులను ప్రభుత్వాలు గుర్తించకపోవడంతో పాటు శ్రమకు తగిన ప్రతిఫలం లేకపోవడంతో ప్రస్తుతం ఈ వృత్తిలోకి కొత్తగా ఎవరూ రావడం లేదు. పూర్వీకుల నుంచి తమకు వారసత్వంగా అబ్బిన ఈ వృత్తిపై ఉన్న మమకారంతో కొంతమంది వదులుకోలేక కొనసాగుతున్నారు. ప్రస్తుతం రామిరెడ్డి పాళెంలో 30 కుటుంబాల వారు మాత్రమే ఈ వృత్తిలో వున్నారు.అంతరించి పోతున్న ఈ అరుదైన కళను ప్రభుత్వం ప్రోత్సహించి, కాపాడాల్సిన అవసరం ఉంది.

ఇంటిల్లిపాదీ పనిచేస్తాం



ఇంటిల్లిపాదీ రెండు రోజులు పనిచేస్తే ఒక పన్ని తయారవుతుంది.దాన్ని విక్రయిస్తే ఖర్చులు పోనూ రూ.వెయ్యి కూడా మిగలడం లేదు. అరుదైన ఈ కళ అంతరించిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చేనేత రంగానికి అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలి.

- ఎస్‌కే బాషా

ప్రభుత్వం ఆదుకోవాలి



చేనేత మగ్గాలకు పన్ని ఊపిరిలాంటిది. పన్ని లేనిదే పట్టుచీరలు నాణ్యతగా తయారీ కాదు. తరతరాలుగా మేము పన్ని తయారీలోనే బ్రతుకుతున్నాం. ఇది చాలా ఓర్పుతో కూడుకున్న పని.కూర్చున్న చోటు నుంచి కదలకుండా గంటలపాటు ఉండాల్సి వస్తుంది. ఇది పన్ని కళాకారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొద్ది కాలానికే శరీరం పటుత్వం కోల్పోతుంది. నేత కార్మికులను ఆదుకున్నట్లే మమ్మల్ని కూడా ప్రభుత్వం ఆదరించాలి. వారిలాగే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. నేత కార్మికులకు ఇచ్చినట్లే పింఛన్ కూడా మంజూరు చేయాలి.

- షేక్ బషీర్ సాహెబ్



రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

రూ.21.53 లక్షల దుర్వినియోగంతో పాటు అవినీతి ఆరోపణలు

తిరుపతి(నేరవిభాగం)/రేణిగుంట, జూన్ 8 : తీవ్రమైన అవినీతి ఆరోపణలతో పాటు ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సిన దాదాపు రూ 21.53 లక్షల దుర్వినియోగం కేసులో రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ శోభారాణి సస్పెండయ్యారు.జిల్లా స్టాంపుల రిజిస్ట్రేషన్ డీఐజీ శ్రీనివాసులరెడ్డి శనివారం రాత్రి ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి భూముల రిజిస్ట్రేషన్లు, ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్లు, వివిధ రకాల చలానాలు, సర్టిఫైడ్ కాపీల ద్వారా రోజూ వేలాది రూపాయలు వసూలవుతుంది. ఈ నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి.అయితే సుమారు రెండేళ్ళుగా స్టాంపుల విక్రయం, ఈసీలు, నకళ్ల ద్వారా వచ్చిన దాదాపు రూ 21.53 లక్షలు బ్యాంకులో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు సబ్ రిజిస్ట్రార్ శోభారాణిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై చిత్తూరు డీఐజీ గిరిబాబు విచారణకు ఆదేశించారు.పిచ్చాటూరు, సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్లు సుధాకర్, సుమలత విచారణ జరిపి రెండు నెలల క్రితం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీనిపై అప్పట్లోనే జూనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్‌ను సస్పెండ్ చేశారు. విచారణలో శోభారాణి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లుగా తేలడంతో ఆమెపై సస్పెన్షన్ వేటు వేస్తూ చిత్తూరు డీఐజీ గిరిబాబు శనివారం ఆదేశాలు జారీ చేసారు.వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సమీప బంధువని చెప్పుకుంటూ శోభారాణి అనేక వివాదాస్పద భూములను రిజిస్టర్ చేసి డాక్యుమెంట్ రైటర్స్ చేత కోట్లాది రూపాయలు వసూలు చేయించినట్లు ఆరోపణలున్నాయి. గతంలో కడప జిల్లా పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన కాలంలోనూ ప్రభుత్వ భూములు రిజిస్టర్ చేసి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నట్లు ఆరోపణలు వున్నాయి.2022లో ఆమె రేణిగుంటకు బదిలీపై వచ్చారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి వివాదాస్పద భూములకు సంబంధించి వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

అవినీతికి కేరాఫ్ అడ్రస్

చాలాకాలంగా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గతంలో ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డిపై విపరీతమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగాభూముల మార్కెట్ రేట్లు అడ్డదిడ్డంగా పెంచేయడంతో దుమారం రేగింది. దీంతోపాటు అవినీతి ఆరోపణలపై ఆయన్ను సస్పెండ్ చేశారు.ఆయన స్థానంలో వచ్చిన శోభారాణి స్టాంపు వెండర్ల చేత రిజిస్ట్రేషన్ సమయంలో అంకణానికి రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారన్న ప్రచారం జరిగింది. దీన్ని అవకాశంగా భావించిన స్టాంపు వెండర్లు ఏకంగా అంకణానికి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు సబ్ రిజిస్ట్రార్‌కు కట్టాలని చెబుతూ వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి.ప్రభుత్వ భూములకు సైతం పక్కనున్న పట్టాదారుసర్వే నెంబరు వేసి రిజిస్ట్రేషన్ చేసేశారన్న ఆరోపణలున్నాయి.



మీడియా రంగంలో చెరగని ముద్ర

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి నేపథ్యంలో చిల్లకూరు మండలం ఏరూరుకు చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ శనివారం సముద్రతీరంలో ఆయన సైకత శిల్పాన్ని రూపొందించి నివాళులర్పించారు.మీడియా, సినీరంగాల్లో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న రామోజీరావు పలు సంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉపాధి కల్పించారన్నారు.

- చిల్లకూరు

తిరుమల ఏఎస్పీపై బదిలీ వేటు



- అచ్చెన్నాయుడి అరెస్టు వ్యవహారంలో కీలకపాత్ర

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల ఏఎస్పీ శివరామిరెడ్డి శనివారం బదిలీ వేటుకు గురయ్యారు. నేరుగా ఆయన్ను పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజుకు సూచించారు.టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడిని మూడేళ్ల క్రితం అరెస్టు చేసిన సమయంలో శివరామిరెడ్డి కాశీబుగ్గ డీఎస్పీగా పనిచేసేవారు.అప్పట్లో అనారోగ్యంతో వున్న అచ్చెన్నాయుడి పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారన్న చెడ్డపేరు మూటగట్టుకోవడం గుర్తుండే వుంటుంది.

నిలకడగా నిమ్మధరలు



గూడూరు అర్బన్, జూన్ 8: గూడూరు నిమ్మ మార్కెట్‌లో కొద్దిరోజులుగా నిమ్మకాయల కొనుగోళ్లు నిలకడగా సాగుతుండడంపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం కూడా కిలో నిమ్మకాయల ధర రూ. 90 వరకూ పలికింది. లూజు బస్తా రూ. 6,800, టిక్కీ బస్తా రూ.4,250 పలికింది. కనిష్ఠంగా కిలో రూ.60 పలికింది. గతేడాది జూన్‌లో కిలో రూ.10 నుంచి రూ.30 వరకు పలకగా ఈ సారి మూడు రెట్లు అదనంగా ధర, విక్రయాలు పెరగడంతో నిమ్మ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రుతుపవనాల ఆగమనంతో వర్షాలు కురుస్తున్నా నిమ్మ ధరలు స్థిరంగా ఉండడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నృత్యం ముగ్ధ మనోహరం



తిరుచానూరు, జూన్ 8: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వేసవి సెలవులు, రెండో శనివారం కావడంతో రాత్రి శ్రీనటరాజ డ్యాన్స్ బృందం ప్రదర్శించిన శాస్త్రీ నృత్య ప్రదర్శన ముగ్ధమనోహరంగా సాగింది. వినాయక స్తోత్రం, భారత వేదముగా, గురుబ్రహ్మ గురువిష్ణు, నీలినీలి కళ్లవాడే మాయలు చేశాడే.. అదివో అల్లదివో వేయినామాలవాడ వెంకటేశుడా వంటి పాటలకు కళాకారులు లాలన్‌రాజ్, హేమశ్రీ, దీపిక, వార్షిక, రేషిక, శ్రీభవ్య, సౌజేష్, అక్షయ, హర్షిణి, సాత్విక, యజ్ఞశ్రీ ప్రదర్శించిన నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు.

భర్త ఇంటి ఎదుట దీక్ష


ధరణి

పాకాల, జూన్ 8: ఇంట్లోని రానివ్వాలని భర్త ఇంటి ఎదుట ఓ వివాహిత దీక్షకు దిగారు. ఈ ఘటన శనివారం మండలంలోని చెన్నుగారిపల్లెలో జరిగింది. బాధితురాలు ధరణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆమె మాటల్లోనే.. 'చెన్నుగారిపల్లెకు చెందిన రాజ్‌కుమార్, నేను నాలుగేళ్లుగా ప్రేమించుకుని.. ఒకటిన్నర ఏడాది కిందట వివాహం చేసుకున్నాం. ఇద్దరం ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాం. పెళ్లయిన మూడు నెలల వరకు కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత మనస్పర్థలు వచ్చాయి. అప్పటినుంచి నా భర్త ఆయన తల్లి మాటలు విని డబ్బులు తెమ్మని వేధింపులకు పాల్పడేవాడు. గత దీపావళికి తవణంపల్లె ఎగువమత్యం గ్రామంలో అమ్మగారింటికి వెళ్లాను. తిరిగొచ్చాక అత్తగారింట్లోకి రానివ్వడం లేదు. ఇటీవల విడాకుల నోటీసు కూడా పంపించారు. నాకు.. నా భర్త కావాలి. ఇంట్లోకి అనుమతించి న్యాయం చేయాలి' అంటూ భర్త ఇంటి ఎదుట తన తల్లితో కలిసి దీక్షకు దిగారు. ఇంట్లోకి అనుమతించేవరకు దీక్ష కొనసాగిస్తానని ధరణి స్పష్టం చేశారు.

వైసీపీ కార్యకర్తలకు చెవిరెడ్డి భరోసా

పాకాల, జూన్ 8: మండలంలోని రవణయ్యగారిపల్లె, ఊట్లవారిపల్లె, పాకాలలో శనివారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పర్యటించారు. ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలపై నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు.

కార్యకర్తలే నా కుటుంబం : ఎమ్మెల్యే పులివర్తి నాని


నానిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, జూన్ 8: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే తన కుటుంబ సభ్యులని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం శ్రీనివాస మంగాపురంలో కల్యాణ వెంకన్నను దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా చంద్రగిరి పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ కోసం అహర్నిశలు శ్రమించి ప్రమాదంలో అశువుల బాసిన సీనియర్ టీడీపీ నాయకులు గంగపల్లి భాస్కర్, యువనాయకుడు భానుప్రకాష్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళి అర్పించారు. వారి సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం గంటకుపైగా కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యకర్తల కృషి ఫలితంగానే రికార్డు మెజార్టీ సాధ్యమైందని స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానని, ఆరోగ్యం కుదట పడగానే నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, నాయకులు రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా, ప్రవీణ్, కొటాల సుధా, బాలకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. కాగా, శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిని శనివారం పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి దర్శించుకున్నారు.

చికిత్స పొందుతూ
ఆటో డ్రైవర్ మృతి

చంద్రగిరి, జూన్ 8: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ ఆటోడ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏర్పేడు మండలం ఆర్వీ కండ్రిగకు చెందిన రంజిత్‌కుమార్ (34) చంద్రగిరి పంచాయతీ కోట గ్రామంలో కాపురం ఉంటూ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మండలంలోని ఎం.కొత్తపల్లె నుంచి చంద్రగిరికి ఆటో నడుపుకుంటూ వస్తున్నాడు. మామండూరు వద్దకొచ్చేసరికి చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న లారీ ఉన్నట్టుండి పక్కకు తిరిగింది. దాంతో వెనుక వస్తున్న ఆటో అదుపుతప్పి లారీని ఢీకొంది. ఈప్రమాదంలో ఆటో బోల్తాపడింది. డ్రైవర్ రంజిత్‌కుమార్‌కి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాక్సీ, ఆటో డ్రైవర్ల మధ్య రగడ


కర్రలతో వెంకటేష్‌పై దాడి చేస్తున్న పవన్, మరో వ్యక్తి


చికిత్స పొందుతున్న డ్రైవర్ లోకేష్


తీవ్రంగా గాయపడ్డ వెంకటేష్ →

నలుగురికి తీవ్రగాయాలు
వివాదాలకు తావిస్తున్న శ్రీవారి మెట్టు ప్రయాణం

చంద్రగిరి, జూన్ 8: ట్యాక్సీ, ఆటోడ్రైవర్ల మధ్య జరిగిన రగడలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీవారి మెట్టు వద్ద తిరుమలేశుడి దర్శనం టోకెన్లు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ టోకెన్లు తీసుకుంటే దర్శనం త్వరగా అవుతుందని తిరుపతి నుంచి భక్తులను అక్కడి ట్యాక్సీ డ్రైవర్లు తమ అద్దె వాహనాల్లో శ్రీవారి మెట్టు వద్దకు తీసుకొస్తున్నారు. భక్తులు టోకెన్లు పొందాక వారిని తిరిగి తిరుపతికి తీసుకెళ్లి.. అలిపిరి వద్ద దింపుతున్నారు. ఇలా తిరుపతి నుంచి వచ్చే అద్దె వాహనాలు నేరుగా శ్రీవారిమెట్టు వద్దకు వెళ్లి రావడంతో శ్రీనివాసమంగాపురం వద్ద ఉన్న ఆటోడ్రైవర్లకు బాడుగులు రావడం లేదు. అందువల్ల తిరుపతి నుంచి తీసుకొచ్చే భక్తులను శ్రీనివాసమంగాపురంలోనే వదిలేయాలని.. ఇక్కడినుంచి తమ వాహనాల్లో తీసుకెళతామని గతంలో అనేకసార్లు తిరుపతి అద్దె వాహనాల డ్రైవర్లతో వాగ్వాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో శనివారం కూడా తిరుపతి జీవకోనకు చెందిన వెంకటేష్ తన ఆటోలో తిరుపతి నుంచి భక్తులను తీసుకుని శ్రీవారిమెట్టు వద్దకు వెళుతుండగా, మార్గం మధ్యలోని పంప్ హౌస్ సమీపంలో శ్రీనివాసమంగాపురం ఆటోస్టాండ్‌కు చెందిన పవన్, మరో తొమ్మిదిమంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన వాగ్వాదంలో వెంకటేష్‌పై కర్రలతో దాడి చేశారు. వెనుకన వస్తున్న ట్యాక్సీ డ్రైవర్లు తిరుపతికి చెందిన లోకేష్, భాకరాపేటకు చెందిన త్రివిక్రమ్, నగరికి చెందిన మురళి గమనించి అడ్డుకున్నారు. వీరిపైనా దాడిచేశారు. ఈదాడిలో వెంకటేష్, లోకేష్, త్రివిక్రమ్, మురళికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు పవన్, మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే.. ఈ దాడి జరుగుతున్న సమయంలో ఆదారిలో వెళ్లే భక్తులు భయాందోళనకు గురయ్యారు. దీనిపై ఇటు టీటీడీ యంత్రాంగం, అటు పోలీసులు పట్టించుకోక పోవడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు.

అమిలినేని మధుకు పలువురి శుభాకాంక్షలు


అమిలినేని మధుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పులివర్తి నానీ సతీమణి సుధారెడ్డి, తనయుడు వినీల్ తదితరులు


మధుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పులివర్తి నాని

తిరుపతి రూరల్, జూన్ 8: తిరుపతి రూరల్ మండలానికి చెందిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎంపీటీసీల సంఘ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అమిలినేని మధు జన్మదినాన్ని శనివారం టీడీపీ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి, తనయుడు వినీల్‌లు శుభాకాంక్షలు తెలిపారు. రూరల్‌మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు చెరుకూరి మధుశేఖర్, వైకుంఠ శ్రీధర్‌నాయుడు, జనార్ధన్‌చౌదరి, కత్తి సుధాకర్, పేరూరు శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, హరి, సాయి, జనార్ధన్‌రెడ్డి, శివయ్యనాయుడు, దామా రాజారావు, వాసు, గణపతినాయుడు తదితరులు కూడా మధుకు శుభాకాంక్షలు తెలిపారు.

తిరుచానూరు: టీడీపీ కార్యాలయంలో అలిమినేని మధుకు ఎమ్మెల్యే పులివర్తి నాని శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, పల్లినేని సుబ్రహ్మణ్యంనాయుడు, గౌస్ బాషా, గణపతినాయుడు, బిరుదాల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూతలపట్టు ఎమ్మెల్యేగా గెలుపొందిన మురళికి అభినందనలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు ఇనుకొండ లక్ష్మణరావు, పాతకం వెంకటేష్, చిన్ని, నరేష్, తదితరులు

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


మాగుంట శ్రీనివాసులు రెడ్డి - గడ్డం వంశీకృష్ణ, వివేక్

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

దాడి కేసులో కామిరెడ్డి సహా నిందితులకు రిమాండ్

పెళ్లకూరు, జూన్ 8: చిల్లకూరులో జరిగిన దాడి కేసులో ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితోపాటు ఎనిమిదిమంది నిందితులకు సూళ్లూరుపేట కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. అనంతరం వారిని నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. శుక్రవారం రాత్రి అరెస్టు చేసిన సత్యనారాయణరెడ్డిని శనివారం రాత్రి పోలీసుల బందోబస్తు నడుమ నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. పరస్పర దాడులకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వివాదస్పదంగా ఉన్న చిల్లకూరు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఘర్షణలకు దిగితే జైలుపాలు కాక తప్పదని పేర్కొన్నారు.


ఎన్టీఆర్ సర్కిల్ పేరు నిలబెట్టారు


విగ్రహ స్థాపనలో పాల్గొన్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, జూన్ 8 : చిత్తూరు టీడీపీ నేతలు ఎట్టకేలకు ఎన్టీఆర్ సర్కిల్ పేరును నిలబెట్టారు. 2018లో నగరంలోని గాంధీ సర్కిల్‌ను అప్పటి ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ నగర సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహాన్ని గాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేశారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదే ఏడాది అక్టోబర్ 17వ తేదీ రాత్రి అప్పటి ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని ఇతర నేతలు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. కొన్ని గంటల్లోనే విగ్రహ ఏర్పాటుకు అనుమతులు లేవని, తొలగించాలని అధికారులు చెప్పడంతో చేసేదిలేక విగ్రహాన్ని జిల్లా టీడీపీ కార్యాలయానికి తరలించారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో శనివారం రాత్రి విగ్రహాన్ని గాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సందీప్, మాజీ మేయర్ కఠారి హేమలత, పార్టీ చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, తెలుగుయువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, బంగారుపాళ్యం మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట జాతకులు

- ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన నేతల అంతర్మథనం



రాజకీయాలన్నవి పరమపద సోపానపటంలో ఆటలాంటివే అంటారు. ఆచితూచి అడుగు వేయకపోతే భవిష్యత్తు అధఃపాతాళంలోకి జారిపోతుంది. ఉద్వేగంతో తీసుకునే నిర్ణయాలు ఎదురు తిరుగుతాయి. ఎంతో కాలం టీడీపీలో ఉండి ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన కొందరు జిల్లా నాయకుల పరిస్థితి ఇప్పుడు ఇలాగే అయ్యింది. వైసీపీ గెలుస్తుందనే నమ్మకంతో భవిష్యత్తును ఆశించి పార్టీ మారిన వీరికి టీడీపీ విజయంతో భంగపాటు ఎదురైంది. ఉన్నచోటా ఉనికీ గౌరవమూ దక్కేలా లేదు. మళ్లీ వెనక్కి దూకుదామా అన్నా మతిస్తారనే నమ్మకం లేదు. వీళ్లని నమ్ముకున్న అనుచరులు ఇప్పుడు మరీ ఎక్కువగా చింతిస్తున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఏమిటిది హరికృష్ణ?



మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణకు టీడీపీ 2019 ఎన్నికల్లో జీడీ నెల్లూరు నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చింది. నారాయణస్వామి చేతిలో ఓడిపోయిన ఈయన ఆ తర్వాత పత్తా లేరు. పార్టీ కార్యక్రమాల్లో కనిపించని ఈయన ఎన్నికలకు ముందు పూతలపట్టులో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. కనీసం సైలెంట్‌గా ఉన్నా మంచి జరిగేది కదన్నా అని ఆయన అనుచరులు వాపోతున్నారు.

సుబ్రమణ్యంరెడ్డి.. పాపం రెండోసారీ!

కుప్పానికి చెందిన జడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి గతంలోనూ ఇప్పుడూ ఎన్నికలకు ముందే తప్పటడుగు వేసి దెబ్బతిన్నారు. కుప్పంలో చంద్రబాబు మీద 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు పోటీ చేసిన నాయకుడిగా సుబ్రమణ్యంరెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. మంచి భవిష్యత్తును ఆశించి 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. దురదృష్టం వెంటాడి అప్పుడు వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత నిశ్శబ్దంగా ఉండిపోయిన ఆయన 2024 ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి మళ్లీ వైసీపీలో చేరారు. రెండోసారి కూడా దురదృష్టమే సుబ్రమణ్యం రెడ్డిని వెక్కిరించింది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చింది.



అయ్యో.. అనీషా



2019 ఎన్నికల్లో పుంగనూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన అనీషారెడ్డి సరిగ్గా ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. జిల్లా రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన దివంగత నేత రామకృష్ణారెడ్డి కుమారుడైన అమరనాథరెడ్డి సోదరుడు శ్రీనాథరెడ్డి భార్య అనీషారెడ్డి. 2019 ఎన్నికల దాకా పెద్దిరెడ్డి దాష్టీకాన్ని సవాలు చేసిన ఈమె ఓటమి తర్వాత అంత క్రియాశీలకంగా పార్టీ వ్యవహారాల్లో లేరు. చల్లా రామచంద్రారెడ్డికి పుంగనూరు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించిన తర్వాత ఈమె పూర్తి అసంతృప్తితో ఉన్నారు. అయితే అనీషారెడ్డి భర్త శ్రీనాథ్‌రెడ్డికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పదవి ఇచ్చారు. అయినా ఈ దంపతులు సంతృప్తి చెందలేదు. పుంగనూరు టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అని ప్రకటించిన తర్వాత ఈ దంపతులు ఇడుపులపాయలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. నిజానికి వీరికి చంద్రబాబు వద్ద మంచి సాన్నిహిత్యం ఉండేది. పార్టీ మారడంతో ఆ విశ్వసనీయతను కోల్పోయారు. సరిగ్గా టీడీపీ అధికారంలోకి వచ్చే వేళ వేసిన తప్పటడుగు వీరి రాజకీయ భవితవ్యానికి శాపంలా మారింది. నిజానికి వైసీపీ అధికారంలోకి వచ్చివున్నా పెద్దిరెడ్డి రాజ్యంలో వీరి ఉనికికి విలువా గౌరవం ఉండే అవకాశం కూడా లేదు.

బోల్తాపడ్డ బోస్



పలమనేరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత సుభాష్ చంద్రబోస్ ఎన్నికలకు ముందు జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. బాలాజీ సహకార సూపర్‌మార్కెట్‌కు రెండు దశాబ్దాలకుపైగా చైర్మన్‌గా వ్యవహరిసున్న ఈయనకు పట్టణంలో మంచి పేరుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి, వైసీపీ అభ్యర్థి అమరనాథరెడ్డి చేతిలో ఓటమి చెందారు. 2017లో అమరనాథరెడ్డి టీడీపీలో చేరి మంత్రి పదవి తీసుకున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసినా పార్టీ అధికారంలోకి రాకపోవడంతో ఈయనకు గుర్తింపు లభించలేదు.ఈ అసంతృప్తిలో ఉన్న సుభాష్‌చంద్రబోస్ తాజా ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి వెంకటేగౌడ కోసం పనిచేశారు. వైసీపీ ఘోరంగా ఓటమి పాలవడంతో ఈయన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అదే టీడీపీలో ఉండి ఉంటే గుర్తింపు వచ్చేదని, ప్రత్యామ్నాయంగా ఏదో ఒక పదవి దక్కి ఉండేదనే చర్చ పట్టణంలో జరుగుతోంది.

పట్టుజారిన లలితకుమారి

2009వ సంవత్సరానికి ముందు పలమనేరు నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వుడుగా ఉండేది. 2004 ఎన్నికల్లో లలితకుమారి పలమనేరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2009లో పలమనేరు జనరల్‌కు కేటాయించడం, కొత్తగా ఏర్పడిన పూతలపట్టు ఎస్సీలకు కేటాయించడంతో ఆమె పూతలపట్టుకు వచ్చారు. 2009, 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ ఆమెకు వరుసగా మూడుసార్లు అవకాశమిచ్చింది. 2009లోనూ, 2014లోనూ వెయ్యి ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే నియోజకవర్గంలో అంత క్రియాశీలకంగా ఉండని లలితకుమారి ఈసారి కూడా పార్టీ టికెట్ ఆశించారు. రాదని తేలడంతో ఆమె పూతలపట్టులో జగన్ సమక్షంలో వైసీపీలో చేరిపోయారు. తన రాజకీయ భవిష్యత్తుకు తనే అడ్డుకట్ట వేసుకున్నారని ఆమె అనుచరులే వ్యాఖ్యానిస్తున్నారు.



భంగపడ్డ రావూరి



పదేళ్ల పాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసిన రావూరి ఈశ్వరరావు తనకు తగిన గుర్తింపు లేదని 2019 నుంచి నిశ్శబ్దంగా ఉండిపోయారు. చంద్రబాబుకు సన్నిహితుడిగా పేరున్న ఈ బీసీ నేత ఎన్నికలకు ముందు పూతలపట్టులో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి కోసం పనిచేశారు. టీడీపీ నాయకుడిగా ఎప్పుడూ వార్తల్లో కనిపించే ఈయన భవిష్యత్తుకు తాజా పరిణామంతో గండిపడింది. అలాగే చాలాకాలంగా రాజకీయాలకు దూరంగా ఉండిపోయిన చిత్తూరు చివరి మున్సిపల్ చైర్‌పర్సన్ సరళామేరి ఎన్నికలకు ముందు తిరిగి క్రియాశీలకమయ్యారు. వైసీపీలో చేరి విజయానందరెడ్డి కోసం పనిచేశారు. భవిష్యత్తును ఆశించిన ఆమె టీడీపీ గెలుపుతో భంగపడ్డారు.

కాణిపాక ఆలయ చైర్మన్ రాజీనామా

ఈవోకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న మోహన్‌రెడ్డి



ఐరాల(కాణిపాకం), జూన్ 8: కాణిపాకం ఆలయ పాలకమండలి అధ్యక్ష పదవికి మోహన్‌రెడ్డి శనివారం రాజీనామా చేశారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారంతా రాజీనామాలు చేస్తున్న సంగతి తెలిసిందే. తన రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవో వెంకటేశుకు అందించారు. కాగా తనపై నమ్మకం ఉంచి రెండు దఫాలు ఆలయ చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డికి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎమ్మెస్‌బాబుకు మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

తుడా ఛైర్మన్ రాజీనామా

తిరుపతి రూరల్, జూన్ 8: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తుడా ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుడా ఛైర్మన్‌గా అభివృద్ధి పనులు చేయడానికి సహకరించిన అన్ని పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏడాదికాలంగా తన వెంట తిరిగిన పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన పులివర్తి నానీకి అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన వారు ప్రత్యర్థి పార్టీపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం సరికాదన్నారు.

అచ్చెన్నాయుడికి శ్రీవారి ప్రసాదాలు


అచ్చెన్నాయుడికి శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న రుద్రకోటి సదాశివం

తిరుపతి (జీవకోన), జూన్ 8: రాష్ట్రంలో టీడీపీ భారీ మెజార్టీతో విజయం సాధించినందుకు, అలాగే ఎమ్మెల్యేగా విజయం సాధించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం అభినందనలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన్ను విజయవాడలోని స్వగృహంలో కలిసి సన్మానించి, శ్రీవారిచిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

11న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఈనెల 11వ తేదీన 11వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం జరగనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అయోధ్యకాండలోని 40 నుంచి 44వ సర్గ వరకు ఉన్న మొత్తం 162 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 187 శ్లోకాలను పారాయణం చేస్తారు. ఎస్వీ వేదవిజ్ఞానపీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు ఈకార్యక్రమంలో పాల్గొంటారు. ఎస్వీబీసీ ప్రత్యక్షప్రసారం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు ఈ పారాయణంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని టీటీడీ కోరింది.

ఇంటర్ కౌన్సెలింగ్ పరిశీలన


విద్యార్థినులతో మాట్లాడుతున్న టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి

తిరుపతి(విద్య), జూన్ 8: పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌ను టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. మొదటి విడత ప్రవేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన కళాశాలకు చేరుకుని పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హాజరైన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. సాంకేతిక విభాగం సిబ్బంది డాక్టర్ ఉదయ్, హరీష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరణికి మంత్రివర్గంలో చోటివ్వాలి : బలిజసేన


మీడియాతో ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి అర్బన్, జూన్ 8: రాయలసీమలోనే అత్యంత మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు మంత్రివర్గంలో చోటివ్వాలని బలిజసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాయలసీమ పరిధిలో ఎక్కువమందికి మంత్రి పదవులిస్తే వెనుకబడిన సీమ అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతి చుట్టుపక్కల అత్యంత విలువైన ప్రభుత్వ ఆస్తులు దోపిడీకి గురయ్యాయని, వాటిని వెలికితీయాలన్నారు. టీటీడీలో జరిగిన అక్రమాలను బయటపెట్టాలన్నారు. నాయకులు హరిప్రసాద్, నీలాద్రి, గోపీనాథ్, భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

టీ20 ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నీ ప్రారంభం

తిరుపతి(క్రీడలు), జూన్ 8: తుమ్మలగుంట క్రీడా మైదానంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. లీగ్ దశ పోటీల్లో భాగంగా ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో అనంతపురం-కడప జట్లు తలపడ్డాయి. కడప జట్టు పొదుపైన బౌలింగ్, చురుకైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని 138పరుగుల తక్కువ స్కోరుకే కట్టడిచేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కడపజట్టు 7వికెట్లు కోల్పోయి 13బంతులు మిగిలి వుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మధ్యాహ్నం మ్యాచ్‌లో చిత్తూరు-కర్నూలు జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టులోని బ్యాట్స్‌మెన్స్ రాణించడంతో 169పరుగులతో భారీ స్కోరు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరుజట్టు దీటుగా పరుగుల చేసినా.. విజయం ముగింట చతికిల పడింది. కేవలం ఏడు పరుగుల తేడాతో ఓటమి చవి చూసింది.

బర్డ్‌లో కృత్రిమ అవయవాల వితరణ



తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బర్డ్ ఆస్పత్రిలో శనివారం 110 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను వితరణ చేశారు. ఇటీవల తమిళనాడు ధర్మపురికి చెందిన సుబ్రమణియన్ అనే దాత బర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆధునికీకరణకు రూ.కోటి విరాళంగా అందించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా యూకే సాంకేతికతో ఎండోలైట్ కంపెనీ సహకారంతో తయారు చేసిన ఎక్కువ మన్నిక గల కృత్రిమ అవయవాలను ఉచితంగా ఇచ్చారు. బర్డ్ ఆస్పత్రి చేస్తున్న సేవలకుగాను ఎండోలైట్ కంపెనీ అసలు ధరలో 50శాతం రాయితీతో అల్యూమినియంతో తయారు చేసిన ఈకృత్రిమ అవయవాలను టీటీడీకి అందించారు. ఇవి సౌకర్యవంతంగా ఉన్నాయని రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. బర్డ్ ఆస్పత్రి డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది, రోగుల బంధువులు పాల్గొన్నారు.

ఆదుకోండి : కేబుల్ ఆపరేటర్లు


మీడియాతో మాట్లాడుతున్న కేబుల్ ఆపరేటర్లు

తిరుపతి అర్బన్, జూన్ 8: నూతన ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఏపీ కేబుల్ ఆపరేటర్ల జేఏసీ ఛైర్మన్ మిర్యాల శ్రీరాం, కార్యదర్శి పెరుమాల్ మధుబాబు కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం తమ సమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం తీసుకొచ్చిన ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌ను పునరుద్ధరించాలని కోరారు. తాము కూడా మీడియాలో భాగమేనని, అసంఘటిత కార్మికులుగా గుర్తించి, ప్రభుత్వ పథకాలన్నీ వర్తించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దురదృష్టవశాత్తూ చనిపోయిన కేబుల్ ఆపరేటర్లు, సిబ్బందికి ఆర్థిక సాయం చేసి, వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు కార్డును మంజూరు చేయాలన్నారు. అంతకుముందు ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు బసవయ్య, జగదీష్, బుల్లెట్ బాబు, రమణ, దుర్గాప్రసాద్, ప్రకాష్, నగేష్, బాబు, ఆనంద్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇండియా కూటమికి మద్దతివ్వాలి
ముస్లిం ఐక్యవేదిక

తిరుపతి అర్బన్, జూన్ 8: ఇండియా కూటమికి చంద్రబాబు మద్దతివ్వాలని రాష్ట్ర ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు జాఫర్ అలీ విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తుందని, దేశాన్ని కాపాడిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు.రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం హర్షణీయమన్నారు.చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ప్రజలకు మంచిపాలన అందాలన్నారు. మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఖలీల్‌సయ్యద్, సయ్యద్ నూర్, నిజాముద్దీన్, షౌకత్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 63,830 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 30,810 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ శ్రీవారిని దర్శించుకున్నారు.

రేపటినుంచి ఎస్వీయూలో తరగతుల ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 8: ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం నుంచి పీజీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆదివారంతో వేసవి సెలవులు ముగియనున్నాయి. దీంతో పీజీ 4, 2వ సెమిస్టర్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు.

అలరించిన నగరసంకీర్తన

తిరుపతి (కల్చరల్), జూన్ 8: నగరంలో శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జరిగిన నగర సంకీర్తన అలరించింది. సంస్థ అధ్యక్షుడు గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొన్నారు.

భౌతికదాడులు చేయలేదు
శాంతి భద్రతలకు విఘాతం కల్గించలేదు : తెలుగుయువత


మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి అర్బన్, జూన్ 8: రాష్ట్రంలో ఎక్కడా వైసీపీపై భౌతికదాడులు చేయలేదు.. శాంతి భద్రతలకు విఘాతం కల్గించలేదని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలుగు యువత నేతలు పేట్రేగిపోతున్నారని సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. వైసీపీ కార్యకర్తలే పసుపు కండువాలు కప్పుకుని వాళ్లపై వాళ్లే దాడులు చేసుకుంటున్నారని ఆరోపించారు. శుక్రవారం ఎస్వీయూలో జరిగిన ఘటనలో తెలుగు యువతపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వీసీ రాజీనామా చేయాలని కోరామే తప్ప, దాడిచేయలేదని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చుకున్నారని ఆగ్రహించారు. ఎన్టీఆర్ విగ్రహాలను ధ్వంసం చేశారని గుర్తుచేశారు. ఎంతోమంది టీడీపీ కార్యకర్తలను బలి తీసుకున్నారని ధ్వజమెత్తారు. పదవులు శాశ్వతం కాదని.. ఎవరు తప్పు చేసినా శిక్ష అనుభవించక తప్పదన్నారు. వైసీపీ ప్రభుత్వం అండతో పదవులు దక్కించుకున్నవారు స్వచ్ఛందంగా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి నివాళి అర్పించారు. తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వాసుదేవ్, కరణం సంతోష్, గణేష్, సునీల్, శ్రీరాం, బాబ్జి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం
ఉక్కపోత నుంచి జనానికి ఉపశమనం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 8: జిల్లాలో మోస్తరు వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల కారణంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎండ వేడిమి, ఉక్కపోత నుంచి జనానికి ఉపశమనం లభించింది. శనివారం ఉదయం 10గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మండలాల వారీగా.. చిన్నగొట్టిగల్లులో 36.4 మి.మీ, సూళ్లూరుపేటలో 34.6, నాగలాపురంలో 32.2, చిల్లకూరులో 31.6, పిచ్చాటూరులో 29.4, సత్యవేడులో 28.2, వాకాడులో 26.2, ఎర్రావారిపాళెంలో 25.2, తడలో 22.8, బాలయపల్లిలో 21.8, నారాయణవనం, చిట్టమూరులో 20.2మి.మీ వర్షపాతం నమోదైంది.

ప్రజల రుణం తీర్చుకుంటాం : టీడీపీ


మీడియాతో కోడూరు బాల సుబ్రహ్మణ్యం

తిరుపతి అర్బన్, జూన్ 8: అరాచక పాలన నుంచి విముక్తి కల్గించిన రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకుంటామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును భారీ మెజారిటీతో గెలిపించినందుకు తిరుపతి ప్రజలకు కృతజ్ఞతలన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ప్రజాప్రభుత్వానికి ప్రకృతి కూడా సహకరించి మూడ్రోజులుగా భారీ వర్షాలు కురుస్తూ.. చల్లటి వాతావరణం సంతరించుకుందన్నారు. లోకేశ్ రెడ్‌బుక్‌లో నమోదైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. టీటీడీలో విచ్చలవిడితనానికి పాల్పడ్డారని దాని ప్రతిఫలమే వైసీపీకి ఘోర ఓటమి అని స్పష్టం చేశారు. ఆరణికి మంత్రి పదవి లభిస్తే తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంచనాలు, సర్వేలు తారుమారయ్యాయని, ముస్లింలలో చైతన్యం వచ్చిందని, చంద్రబాబు వెంటే ఉన్నారని ఈ ఎన్నికల్లో నిరూపించారన్నారు. అంతకుముందు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. నాయకులు రఫీహిందూస్తానీ, చరణ్, సలీం, చిన్నారావు, విజయలక్ష్మి, టి.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంగళం రహదారికి వెలుగులు


సిద్ధమైన ఇనుప స్తంభాలు

మంగళం, జూన్ 8: తిరుపతి-కరకంబాడి మార్గం మధ్యలోని మంగళం రహదారికి కొత్త వెలుగులు రానున్నాయి. ఇప్పటి వరకు లీలామహల్ సర్కిల్ నుంచి మంగళం పరిధి ప్రారంభమయ్యే వెంకటేశ్వరకాలనీ వరకు మాత్రమే రహదారిపై అధికారులు లైట్లు ఏర్పాటు చేశారు. ఇపుడు వెంకటేశ్వర కాలనీ నుంచి వెంకటాపురం మీదుగా కరకంబాడి వరకు రహదారిపై దాదాపు 6.3కి.మీమేర లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి.

శ్రీవారి భక్తులకు పటిష్ఠ భద్రత
తిరుమలలో విధులంటే స్వామికి సేవ చేయడమే : ఎస్పీ


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులకు పటిష్ఠ భద్రతను కల్పించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. తిరుమలలోని పోలీస్ కాంప్లెక్స్‌ను శనివారం తనిఖీ చేశారు. తిరుమల వన్‌టౌన్, టూటౌన్, క్రైం స్టేషన్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పోలీసులు అధికారులతో సమీక్షించారు. తిరుమలలో శాంతి భద్రతలు, క్రౌడ్ కంట్రోల్ గురించి తెలుసుకున్నారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. హుందాగా వ్యవహరిస్తూ జిల్లా పోలీసుల ఖ్యాతిని ప్రపంచస్థాయికి పెంచాలన్నారు. తిరుమలలో విధులు నిర్వహించడమంటే శ్రీవారికి సేవ చేయడమే అన్నారు. చిన్నపిల్లలను అపహరించే వారిపై, ఆభరణాలు, వస్తువులను దొంగిలించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలిచ్చారు. స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో తరచూ తనిఖీలు చేపట్టి, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలన్నారు. ఉపాధి కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భవన నిర్మాణ కార్మికుల వివరాలను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనుమానితులు, పాత నేరస్తులను తరుచూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, శివరామిరెడ్డి, డీఎస్పీలు వెంకటాద్రి, శ్రీనివాసాచారి, సీఐలు విజయ్‌కుమార్, సత్యనారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాదు, మధురైకి ఆర్టీసీ నూతన సర్వీసులు


అధికారులతో చర్చిస్తున్న సీటీఎం భాస్కర్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 8: తొలిసారిగా హైదరాబాదు-కాణిపాకం, శ్రీకాళహస్తి-మధురైకి నూతన నాన్ ఏసీ సర్వీసులు, తిరువణ్ణామలైకి అదనపు ఏసీ సర్వీసులను శనివారం ఆర్టీసీ ప్రవేశపెట్టింది. ఈ మేరకు శనివారం ఉదయం సీటీఎస్ కార్యాలయంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం రామచంద్రనాయుడు, డీఎం బాలాజీలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల కోరిక మేరకు వీటిని నడుపుతున్నట్లు తెలిపారు.

కాణిపాకం సర్వీసు ఇలా..

ప్రతి రోజూ సూపర్ లగ్జరీ బస్సు తిరుపతిలో రాత్రి 9.30గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.30గంటలకు హైదరాబాదుకు చేరుకుంటుంది. అదే రోజున రాత్రి 7.30గంటలకు హైదరాబాదులో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.45గంటలకు కాణిపాకం చేరుకుంటుంది. తర్వాత తిరుపతికి వస్తుంది. హైదరాబాదు-కాణిపాకం మధ్య టిక్కెట్ ధర పెద్దలకు రూ.1,121, పిల్లలకు రూ. 622.

మధురై సర్వీసు ఇలా..

ప్రతి రోజూ సూపర్‌లగ్జరీ బస్సు తిరుపతిలో మధ్యాహ్నం 3.30గంటలకు బయల్దేరి శ్రీకాళహస్తికి చేరుకుని సాయంత్రం 4.30గంటలకు తిరుగుముఖం పడుతుంది. 5.30గంటలకు తిరుపతిలో బయల్దేరి చిత్తూరు, తిరువణ్ణామలై, తంజావూర్, తిరుచ్చి నగరాల మీదుగా మరుసటి రోజు ఉదయం 7.30గంటలకు మధురైకి చేరుకుంటుంది. శ్రీకాళహస్తి-మధురై మధ్య టిక్కెట్ ధర పెద్దలకు రూ.1,025, పిల్లలకు రూ.560.

తిరువణ్ణామలైకి మూడు ఏసీ సర్వీసులు

ఏసీ సర్వీసులు ప్రతి రోజూ ఉదయం 5.30, 6.30 గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు తిరుపతిలో బయల్దేరుతాయి. అలాగే తిరువణ్ణామలైనుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం 12, ఒంటి గంటకు, రాత్రి 11గంటలకు బయల్దేరుతాయి. తిరుపతి-తిరువణ్ణామలై మధ్య టిక్కెట్ ధర పెద్దలకు రూ.490, పిల్లలకు రూ.390.


రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సుగుణమ్మ, నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, ఆర్సీ మునికృష్ణ తదితరులు

రామోజీరావుకు ఘన నివాళి

తిరుపతి(నేరవిభాగం/జీవకోన/విశ్వవిద్యాలయాలు/ఉపాధ్యాయనగర్/కల్చరల్/రూరల్/తిరుచానూరు/పాకాల), జూన్ 8: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతికి శనివారం తిరుపతిలో పలువురు ఘన నివాళి అర్పించారు. వీరిలో.. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటుటీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, నాయకులు ఊకా విజయకుమార్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్, టీడీపీ నేత భువన్ కుమార్‌రెడ్డి తదితరులున్నారు.ఎస్వీయూనివర్సిటీలో తెలుగుయువత నేతలు ఆనంద్‌గౌడ్, డాక్టర్ ఎన్. శేషాద్రి నాయుడు, రామ్మోహన్, డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఏబీవీపీ నేత నాదముని, శివ కుమార్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. నాలుగుకాళ్ల మండపంవద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీనాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, కళావతి, శాంబోల హరినాథ్, కేశవులురెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి నివాళిఅర్పించారు. బైరాగిపట్టెడలోని తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో రామోజీరావుతో పాటు ఇటీవల మృతి చెందినప్రముఖ రచయిత కలువగుంట రామమూర్తి చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళి అర్పించారు. భూమన్, టీటీడీ సీఏవో శేషశైలేంద్ర, ప్రముఖ రచయితలు మధురాంతకం నరేంద్ర, రాసాని, తిరసం అధ్యక్షుడు సాకం నాగరాజు, తోట వేంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, అరసం జిల్లా అధ్యక్షుడు యువశ్రీమురళి, ప్రముఖ కథా రచయిత కృష్ణస్వామి రాజు, శ్రీమన్నారాయణ, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆకుల మల్లేశ్వరరావు, వేమూరి జయరాం ప్రసాద్, వి. కాంతారావు, సురేంద్ర రొడ్డా, టెంకాయల రామోదరం, చెన్నకేశవ నాయుడు. సుభద్ర తదితరులు పాల్గొన్నారు. రామోజీరావు మృతి అత్యంత బాధాకరమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తెలుగువారి గుండెల్లో రామోజీరావు చెరగని ముద్ర వేశారన్నారు.వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. తుమ్మలగుంటలో టీడీపీజిల్లా ప్రచారకార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని తిరుపతిరూరల్‌మండల టీడీపీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.పాకాల ఆర్టీసీ బస్టాండు సమీపంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు కొవ్వొత్తులు వెలిగించి రామోజీరావుకు నివాళి అర్పించారు.

విధుల్లో తీసుకుని న్యాయం చేయండి
స్పెషల్ పోలీసు ఆఫీసర్స్ సివిలియన్స్ అసోసియేషన్


ప్లకార్డులు చూపుతున్న ధర్మచంద్ తదితరులు

తిరుపతి అర్బన్, జూన్ 8: తమను మళ్లీ విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని ఏపీ స్పెషల్ పోలీసు ఆఫీసర్స్ సివిలియన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ధర్మచంద్ కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం 2020లో లిక్కర్, రెడ్‌శాండిల్, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేదిశలో భాగంగా 2,156 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారని గుర్తుచేశారు. కరోనా సమయంలో కూడా అన్నివిధాలుగా శ్రమిస్తూ డ్యూటీ చేసినా రెండేళ్ల కిందట ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విధులనుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి బుజ్జగింపునకు మోసపోయమని వాపోయారు. తమ కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని, నూతన ప్రభుత్వం విధుల్లోకి తీసుకుని, ఆదుకోవాలని కోరారు. తెలంగాణలో ఈ వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి కూడా కొనసాగిస్తున్నారని చెప్పారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

గూడూరు, జూన్ 8: గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, పలు సంస్థల ప్రతినిధులు, యూనియన్ల నాయకులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని వర్గాల కృషితోనే తాను విజయం సాధించానన్నారు. వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

యువతకు అత్యధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే విజయశ్రీ



ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానిస్తున్న తెలుగుయువత నాయకులు

నాయుడుపేట, జూన్ 8: దేశ బంగారు భవిష్యత్తుకు వెన్నెముకలాంటి యువతకు కూటమి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలో శనివారం తెలుగుయువత నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ... దేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలంటే యువతకు ఉపాధి అవసరమన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను దగా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.సుధీర్, నాయకులు జి.సుధీర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గోపాల్, సాహిద్, సందీప్, సాయికిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో రాణించేందుకు నగదు ప్రోత్సాహం



గూడూరు, జూన్ 8: పేద బలిజ విద్యార్థినులు చదువుల్లో రాణించేందుకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు బలిజ మహిళా సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షురాలు ఎస్.సులక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని గమళ్లపాళెంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రతిభచాటిన దుర్గాదేవికకు సంఘం ఆధ్వర్యంలో ఏ.సురేష్ జ్ఞాపకార్థం రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. పద్మావతి, సరోజనమ్మ, సువర్ణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు



గూడూరు అర్బన్, జూన్ 8: రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా, నియోజకవర్గంలో ఎమ్మెల్యే గా పాశిం సునీల్‌కుమార్ విజయం సాధించాలని 28వ వార్డు టీడీపీ నాయకులు ప్రసన్న వేంకటేశ్వరస్వామికి మొక్కుకున్నారు. కూటమి విజయం సాధించడంతోపాటు చంద్రబాబు, సునీల్‌కుమార్ గెలవడంతో శనివారం ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, ఇశ్రాయిల్ కుమార్, రమేష్‌కుమార్, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



సీతారాములకు కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కోట, జూన్ 8: పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. సీతారామ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో రమణారెడ్డి, సరోజనమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించి ఈ కల్యాణాన్ని తంతును పూర్తి చేయించారు. మొదట ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణాన్ని వేదపండితులు అనంతాచార్యులు, నరేష్‌శర్మ ఆగమోక్తంగా నిర్వహించారు. లోకకల్యాణం కోసం చేస్తున్న ఈ స్వామివారి కల్యాణంలో కోట పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శ్యామసుందరపురంలో అభయాంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాయిబాబా, ధర్మకర్తలు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కవితమ్మ, శరవణ, రాధ, రాజేశ్వరి, గంధం శ్రీనివాసులు, నిర్మలమ్మ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఎన్నికలు ఏకగ్రీవం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న నాయకులు

కోట, జూన్ 8: పట్టణంలోని షాదీ మందిర్‌లో శనివారం యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గూడూరు డివిజన్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 7 మండలాలకు చెందిన ఉద్యోగులు తమ యూనియన్ నేతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. గూడూరు డివిజన్ యూనియన్ అధ్యక్షుడిగా బి.రత్నయ్య, కార్యదర్శిగా షాదీజ్‌బాషా, గౌరవాధ్యక్షుడిగా మునికృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.మాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా డివిజనల్ జనరల్ సెక్రటరీగా ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధీర్‌కుమార్, కోశాధికారిగా జనార్దన్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేసింది.

నేడు హనుమాన్ శోభాయాత్ర



వెంకటగిరి టౌన్, జూన్ 8: హనుమాన్ శోభాయాత్ర ప్రతి హిందువు విజయవంతం చేయాలని విశ్వ హిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు వి.భాస్కర్ అన్నారు. శనివారం పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూన్ 1న నిర్వహించాల్సిన హనుమాన్ శోభాయాత్ర ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిర్వహించలేక పోయామన్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానం నుంచి పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. మల్లికార్జున్, సుధాకర్, పురుషోత్తం, నర్రారవి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈసీలో సీట్ల భర్తీ

వెంకటగిరి, జూన్ 8 : వెంకటగిరి బాలుర ఏపీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంఈసీ గ్రూపులో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారదాబాయి చౌదరి పేర్కొన్నారు. ఏపీఆర్‌జేసీ సీఈసీ 2024 ఏడాది ప్రవేశ పరీక్షలకు హాజరై ప్రస్తుతం సీట్లు లభించని వారితో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. మొదట వచ్చిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ నెల 13వ తేదీ భర్తీ గడువు ముగుస్తుందన్నారు. వివరాలకు నెం.5712625075లో సంప్రదించాలన్నారు.

వివాదాలకు దూరంగా ఉందాం

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల

నాయుడుపేట టౌన్, జూన్ 8: నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వివాదాలకు దూరంగా ఉండాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. విజయశ్రీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నేపథ్యంలో విజయగణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... గత ప్రభుత్వం చేసిన అరాచకాలు, అన్యాయాలను ప్రతిఘటిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు ఓటు ద్వారా వైసీపీని పాతాళానికి తొక్కేశారన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పాతరవేసి... ప్రకృతి వనరులను దోచేసిన దోపిడీదారులకు వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. ప్రజలు ప్రశాంతత కోరుకుంటున్నారని అందుకు కూటమి ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తుందన్నారు. అనంతరం బలిజ సంఘ నాయకుడు కుబేరు మణి ఆధ్వర్యంలో ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, దాము, భాస్కర్‌రెడ్డి, బాబు, చిట్టి, ధనంజయ, లక్ష్మీనారాయణ, లక్ష్మీ పతి, బాబు, మస్తాన్, సుబ్బారావు, నారాయణ, రవి, చక్రపాణి తదితరులు ఉన్నారు.



ఆలయం వద్ద ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

రామోజీరావుకు ఘన నివాళి





రామోజీరావుకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు - రామోజీరావుకు కురుగొండ్ల నివాళి

నాయుడుపేట టౌన్, జూన్ 8: పత్రికారంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసిన అక్షరయోధుడు రామోజీరావు అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావుకు నివాళి అర్పించారు.

వెంకటగిరి: రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీరావు మహోన్నత వ్యక్తి అని, ఆయన మరణం తనని దిగ్భ్రాంతికి గురి చేసిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. కలమే ఆయుధంగా సమాజంలో చైతన్యం నింపేందుకు రామోజీరావు అహర్నిశలు శ్రమించారన్నారు.

గూడూరు: రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్టు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చెప్పారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గూడూరు ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళి అర్పించారు. టీడీపీ కార్యాలయంలో రామోజీరావుకు నివాళి అర్పించారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని కచ్చేరివీధిలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి కార్యాలయంలో రామోజీ చిత్రపటం ఏర్పాటు చేసి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

కోట: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రామోజీరావుకు టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద శనివారం కోటకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తడ: రామోజీరావుకు టీడీపీ శ్రేణులు ఘనంగా నివాళి అర్పించారు. శనివారం స్థానిక బస్టాండ్ కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.మురళీరెడ్డి ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేషన్ పంపిణీలో మాటలకే పరిమితమైన వైసీపీ



రేషన్ దుకాణ ప్రారంభోత్సవంలో నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 8: రేషన్ పంపిణీలో వైసీపీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో శనివారం 8వ రేషన్ దుకాణ పునఃప్రారంభంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2 రూపాయలకే బియ్యాన్ని అందజేసి పేదలకు పట్టెడన్నం పెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సౌకర్యంగా రోజులో ఎప్పుడు వచ్చినా సరుకులను అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటికే సరుకులను అందిస్తామని చెప్పి వాహనాల ద్వారా వీధుల్లో నిలబెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టి సరుకులను అందజేశారని ఆయన విమర్శించారు. టీడీపీ సీనియర్ నేత ఎస్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎక్కడైనా రేషన్ సరుకుల పంపిణీలో జాప్యం జరిగితే తక్షణమే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కూలి పనులకు వెళ్లే వారు రేషన్ సరుకులను తీసుకోలేక నానా అవస్థలు పడ్డారని అలాంటి పరిస్థితులు ఇక ఉండవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పసల గంగాప్రసాద్, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అరవపెరిమిడి చంద్రారెడ్డి, బాబు, మస్తాన్, రామారావు, చక్రపాణి, ధనంజయ, శశి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

15 సవర్ల బంగారు నగల చోరీ



చిందరవందరగా ఉన్న వస్తువులు

నాయుడుపేట టౌన్, జూన్ 12: మండలంలోని అయ్యప్ప రెడ్డి పంచాయతీలో ఉన్న జగనన్న కాలనీలో 15 సవర్ల బంగారు చోరీ జరిగినట్లు బాధితుడు అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనిల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చెన్నైలో విధులు నిర్వహిస్తూ జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నాడు. రెండు నెలల క్రితం భార్య ప్రసవానికి పుట్టింటికి వెళ్లడంతో ఇంటికి తాళాలు వేసుకొని చెన్నై వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటికి సమీపంలో ఉన్న స్నేహితులు ఫోన్ చేసి ఇంటి తాళాలు ధ్వంసమైనట్టు గుర్తించి సమాచారం అందించారు. నాయుడుపేటకు చేరుకొని ఇంటికి వెళ్లి పరిశీలించిన అనిల్... ఓ బాక్సును పరిశీలించగా అందులో నగలు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. 15 సవర్ల బంగారు, ల్యాప్‌టాప్ చోరీ జరిగినట్లు పేర్కొన్నాడు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే నాయుడుపేట పట్టణానికి సమీపంలో ఉన్న తుమ్మూరు ఇందిరా కాలనీలో పాత్రలు చోరీ జరిగినట్లు బాధితుడు వెంకటేశ్వర్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాలనీలో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి 11 గంట లకు ఇంటికి వెళ్లాడు. ఇంటికి వేసి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న సామాన్లు చోరీ జరిగినట్లు గుర్తించి శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

శ్రీవారి భక్తులకు పటిష్ఠ భద్రత

తిరుమలలో విధులంటే స్వామికి సేవ చేయడమే: ఎస్పీ

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులకు పటిష్ఠ భద్రతను కల్పించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. తిరుమలలోని పోలీస్ కాంప్లెక్స్‌ను శనివారం తనిఖీ చేశారు. తిరుమల వన్‌టౌన్, టూటౌన్, క్రైం స్టేషన్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పోలీసులు అధికారులతో సమీక్షించారు. తిరుమలలో శాంతి భద్రతలు, క్రౌడ్ కంట్రోల్ గురించి తెలుసుకున్నారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. హుందాగా వ్యవహరిస్తూ జిల్లా పోలీసుల ఖ్యాతిని ప్రపంచస్థాయికి పెంచాలన్నారు. తిరుమలలో విధులు నిర్వహించడమంటే శ్రీవారికి సేవ చేయడమే అన్నారు. చిన్నపిల్లలను అపహరించే వారిపై, ఆభరణాలు, వస్తువులను దొంగిలించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలిచ్చారు. స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో తరచూ తనిఖీలు చేపట్టి, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలన్నారు. ఉపాధి కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భవన నిర్మాణ కార్మికుల వివరాలను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనుమానితులు, పాత నేరస్తులను తరుచూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. అదనపు ఎస్పీలు వెంట్రావు, శివరామిరెడ్డి, డీఎస్పీలు వెంకటాద్రి, శ్రీనివాసాచారి, సీఐలు విజయ్‌కుమార్, సత్యనారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 63,830 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 30,810 మంది తలనీలాలు సమర్పించారు.

తుడా ఛైర్మన్ రాజీనామా

తిరుపతి రూరల్, జూన్ 8: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తుడా ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుడా ఛైర్మన్‌గా అభివృద్ధి పనులు చేయడానికి సహకరించిన అన్ని పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏడాదికాలంగా తన వెంట తిరిగిన పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన పులివర్తి నానీకి అభినందనలు తెలిపారు.

రేపటినుంచి ఎస్వీయూలో తరగతుల ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 8: ఎస్వీయూనివర్సిటీలో సోమవారం నుంచి పీజీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆదివారంతో వేసవి సెలవులు ముగియనున్నాయి. దీంతో పీజీ 4, 2వ సెమిస్టర్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు.

అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ



గమళ్లపాళెం, కటకరాజవీధి, రజక వీధులోని కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

గూడూరు, జూన్ 8: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో పట్టణంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో డ్రైనేజీ కాలువలు దుస్థితికి చేరుకున్నాయని స్థానికులు వాపోతున్నారు. పలుచోట్ల కాలువలు పూడిపోవడం, మరికొన్ని ధ్వంసం కావడం, కొన్ని ప్రాంతాల్లో నిర్మించకపోవడం, కొన్ని ప్రాంతాల్లో నిర్మించినా నిర్వహణ చేపట్టకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. గమళ్లపాళెం, అరుంధతీయ పాళెం, శాంతినగర్, జనార్దన రెడ్డికాలనీ, ధూర్జటినగర్ తదితర ప్రాంతాల్లో మురుగు కదలక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కటకరాజవీధిలో కాలువలు ధ్వంసం కావడం, ధూర్జటినగర్ సమీపంలోని రజకవీధిలో ఓ వైపు కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇదే ప్రాంతంలో మరో వైపు కాలువ నిర్మాణం చేపట్టినా నిర్వహణ లేకపోవడంతో కాలువలలో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. పట్టణంలోని పలు వార్డుల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో వాన నీరు మురుగుతో రోడ్లపై ప్రవహిస్తుండడంతో రాకపోకలకు పట్టణవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు పట్టణంలో మురుగునీటి వ్యవస్థను అభివృద్ధిపరచాలని కోరుతున్నారు.

గూడూరులో కుండపోత



కోనేటిమిట్టలో రోడ్డుపై ప్రహిస్తున్న వర్షపునీరు

గూడూరు, జూన్ 8: పట్టణంలో శనివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 5.30 గంటల నుంచి గంటపాటు జోరుగా వర్షం పడింది. దీంతో కోనేటిమిట్ట, ఆసుపత్రిరోడ్డు, కుమ్మరవీధి, త్యాగరాజవీధి, ఐసీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది. వర్షం కురవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని నిమ్మరైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నిషాన్‌జెండా ఊరేగింపు



గూడూరు అర్బన్, జూన్ 8: పట్టణంలోని దర్గావీధిలో హజరత్ సయ్యద్ హమీం హుసైని జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో శుక్రవారం రాత్రి నిషాన్‌జెండా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా కమిటీ గౌరవాధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఇంటి నుంచి జెండాను దర్గా వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మగ్దూం, షానవాజ్, సందానీ, గౌస్, షబ్బీర్, యాస్దానీ, నయ్యూం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూన్ 8: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామికి శనివారం పూజలు జరిపారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేకపూజలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి స్వామిఅమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

పేరంటాలమ్మకు మంగళసూత్రం వితరణ

సూళ్లూరుపేట, జూన్ 8: మండల పరిధిలోని కోటపోలూరులో కొలువుదీరిన నారాయణ పేరంటాలమ్మకు శనివారం 17 గ్రాముల బంగారు మంగళ సూత్రాన్ని స్టేట్‌బ్యాంక్ ఉద్యోగిని ఐఆర్.హేమలత అందజేశారు. పుత్తూరు స్టేట్‌బ్యాంక్‌లో పనిచేసే హేమలత కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకుని పేరంటాలమ్మకు రూ.1.15 లక్షల విలువైన మంగళసూత్రాన్ని అందించారు.

ప్రజా తీర్పును స్వాగతిస్తున్నా

వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

గూడూరు, జూన్ 8: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైనా మేరిగ మురళీధర్ అన్నారు. శనివారం పట్టణంలోని సనత్‌నగర్‌లోని ఆయన నివాసంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... ఈ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకున్నారని, ఫలితాలు బాధను కల్గించినా ప్రజా తీర్పును గౌరవిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీగా నియోజకవర్గంలోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగితే న్యాయపరమైన పోరాటం చేస్తామన్నారు. తిరుపతి ఎంపీగా వైసీపీకి చెందిన గురుమూర్తి విజయం సాధించడం సంతృప్తినిచ్చిందన్నారు. బి.శ్రీనివాసులు, మగ్దుం మురళి, రాజేష్, నారాయణ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ రాజీనామా



దొంతు శారద

వెంకటగిరి, జూన్ 8 : నెల్లూరు జిల్లా గ్రంథాలయ అభివృద్ధి ఛైర్‌పర్సన్ దొంతు శారద శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామ పత్రాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యా(గ్రంథాలయాలు) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపారు. తన రాజీనామ పత్రాని ఆమోదించాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడబోతున్న తరుణంలో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ లేఖలో ఆమె పేర్కొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్ రాజీనామా

నాయుడుపేట, జూన్ 8: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును శిరసావహిస్తూ... నాయుడుపేట మండల వైసీపీ కన్వీనర్‌గా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో నాయుడుపేట మండలంలో వైసీపీకి 5వేల పైచిలుకు మెజార్టీ వచ్చిందని, 2024 ఎన్నికల్లో రూరల్ మండలంలో టీడీపీకి 1800 మెజార్టీ రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మెయిల్ ద్వారా రాజీనామా చేస్తున్నట్లు సమాచారం అందించానన్నారు. వైసీపీ అధిష్ఠానం, మాజీ ఎమ్మెల్యే కిలివేటి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, కాకాణి ఆదేశాలు శిరసావహిస్తామని తెలిపారు.

భౌతిక దాడులు చేయలేదు

● శాంతి భద్రతలకు విఘాతం కల్గించలేదు

● తెలుగుయువత

తిరుపతి అర్బన్, జూన్ 8: రాష్ట్రంలో ఎక్కడా వైసీపీపై భౌతికదాడులు చేయలేదు.. శాంతి భద్రతలకు విఘాతం కల్గించలేదని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలుగు యువత నేతలు పేట్రేగిపోతున్నారని సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. వైసీపీ కార్యకర్తలే పసుపు కండువాలు కప్పుకుని వాళ్లపై వాళ్లే దాడులు చేసుకుంటున్నారని ఆరోపించారు. శుక్రవారం ఎస్వీయూలో జరిగిన ఘటనలో తెలుగు యువతపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వీసీ రాజీనామా చేయాలని కోరామే తప్ప, దాడిచేయలేదని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చుకున్నారని ఆగ్రహించారు. ఎన్టీఆర్ విగ్రహాలను ధ్వంసం చేశారని గుర్తుచేశారు. ఎంతోమంది టీడీపీ కార్యకర్తలను బలి తీసుకున్నారని ధ్వజమెత్తారు. పదవులు శాశ్వతం కాదని.. ఎవరు తప్పు చేసినా శిక్ష అనుభవించక తప్పదన్నారు. వైసీపీ ప్రభుత్వం అండతో పదవులు దక్కించుకున్న వారు స్వచ్ఛందంగా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి నివాళి అర్పించారు. తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వాసుదేవ్, కరణం సంతోష్, గణేష్, సునీల్, శ్రీరాం, బాబ్జి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వోఎస్‌లో బాలుడి అదృశ్యం



మగధీర (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, జూన్ 8: ఏర్పేడు మండలం నాగంపల్లె వద్ద ఉన్న ఎస్‌వోఎస్ అనాథ పిల్లల శరణాయంలో ఉంటున్న 13 ఏళ్ల బాలుడు అదృశ్యమైనట్లు ఎస్‌వోఎస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన మగధీర(13) రెండేళ్ల క్రితం నాగంపల్లె వద్ద ఉన్న ఎస్ఓఎస్ అనాథ పిల్లల శరణాలయంలో చేరాడు. ప్రస్తుతం ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి ఎస్‌వోఎస్ ప్రహరీ దూకి పారిపోయినట్లు సెక్యూరిటీ సిబ్బంది అధికారులకు తెలిపారు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆగివున్న లారీని ఢీకొన్న ఆటో: డ్రైవర్ మృతి



రంజిత్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, జూన్ 8: ఆగివున్న లారీని, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం చంద్రగిరి వద్ద చోటు చేసుకుంది. ఏర్పేడు మండలం రావిళ్లవారికండ్రిగ గిరిజన కాలనీకి చెందిన రంజిత్ కుమార్(35) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఏర్పేడు నుంచి చంద్రగిరికి బడుగకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా చంద్రగిరి వద్ద రోడ్డుపక్కన ఆగివున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రంజిత్‌ను స్థానికులు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. రంజిత్‌కుమార్‌కు భార్య కృష్ణవేణి అరు నెలల గర్భిణి, శనివారం రంజిత్‌కుమార్ మృతదేహానికి రావిళ్లవారి కండ్రిగ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తారకరామనగర్ వాసులకు వారపుసంత కష్టాలు తీరెదెన్నడు?

తారకరామనగర్, జూన్ 8: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్ వాసులకు వారపుసంతకు వెళ్లడానికి తీవ్ర కష్టాలు పడుతు ఉన్నారు. మండల కేంద్రమైన రేణిగుంటలో ప్రతి శనివారం జరిగే వారపుసంతకు తారకరామనగర్ నుంచి వెళ్లడానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. తారకరామనగర్ నుంచి కరకంబాడి గేట్ వద్దకు ఒక ఆటో, అక్కడి నుంచి రేణిగుంటకు మరో ఆటోను ఆశ్రయించాల్సి వస్తోంది. తిరిగి వచ్చే సమయంలో కొనుగోలు చేసిన కూరగాయలు, ఇతర సామాగ్రిని సంచులకు నింపుకుని ఇళ్లకు తరలించటానికి మహిళలు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. తారకరామనగర్ వాసులు ప్రభుత్వాస్పత్రి, పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయాలకు మండల కేంద్రమైన రేణిగుంటకు వెళ్లాల్సిన పరిస్థితి. గతంలోనే తారకరామనగర్‌లో బస్టాండు, మార్కెట్ నిర్వహణకు స్థలాలు కేటాయించారని, సంబంధిత అధికారులు స్పందించి తారకరామనగర్‌లో మార్కెట్ నిర్వహణతో పాటు, మండల కేంద్రమైన రేణిగుంటకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి, వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 29వేల మంది భక్తులు భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పాలకమండలికి సభ్యుడి రాజీనామా

శ్రీకాళహస్తి, జూన్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యుడు తబ్జుల సుబ్బరామ గుప్తా శనివారం రాజీనామా చేశారు. ఎన్నికల ఫలితాల్లో ప్రజాతీర్పును గౌరవిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

కాటూరు సింగిల్‌విండో ఛైర్మన్ రాజీనామా

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 8: మండలంలోని కాటూరు సింగిల్‌విండో ఛైర్మన్ పదవికి హరినాథరెడ్డి శనివారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా సహకార శాఖ అధికారి పంపించారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ రకాల అభిషేకాలు చేశారు. నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

వరదయ్యపాళెం, జూన్ 8: వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నాణ్యమైన విద్య బోధిస్తామని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య అన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు రుద్రయ్య, మేఘనాథ్, గోకుల కృష్ణ, సుబ్రహ్మణ్యం, నాగరాజు, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింమారావు, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మదురైకి ఆర్టీసీ బస్సు

శ్రీకాళహస్తి, జూన్ 8: శ్రీకాళహస్తి నుంచి మదురైకి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉన్నట్లు డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. తిరుపతి డిపో బస్సు ప్రతిరోజు సాయంత్రం 5గంటలకు శ్రీకాళహస్తి నుంచి బయలుదేరి తిరుపతి, వేలూరు, తిరువన్నామలై, తిరుచ్చిమీదుగా మదురైకి మరుసటి రోజు ఉదయం 6గంటలకు చేరుతుందన్నారు. మదురైలో సాయంత్రం 6గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6గంటలకు శ్రీకాళహస్తికి చేరుతుందని తెలిపారు. టిక్కెటు రూ.1,030గా నిర్ణయించామని చెప్పారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, జూన్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ట చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. ఆ తరువాత స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు,చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

పెద్దిరెడ్డి అక్రమాలపై విచారణ జరిపించాలి

ఆదిమూలం

సత్యవేడు, జూన్ 4: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని సత్యవేడు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో సాగించిన అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. సత్యవేడులోని వీఎంకే కల్యాణ మండపంలో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పెద్దిరెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకుని నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, మైనింగ్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆయన విదేశాలకు పారిపోకుండా చర్యలు తీసుకుని విచారణ జరిపించాలన్నారు. ఇండిపెండెంట్‌లను శిఖండుల్లాగ అడ్డుపెట్టుకుని తనను ఓడించేందుకు పెద్దిరెడ్డి కుటిల ప్రయత్నాలు చేశారని విమర్శించారు. అయితే ఈ క్రమంలో కొందరు టీడీపీ నేతలు ఇండిపెండెంట్ అభ్యర్థులతో కుమ్మక్కై పార్టీని ఓడించేందుకు ప్రయత్నించారని వాపోయారు. పెద్దిరెడ్డి నుంచి నియోజకవర్గాన్ని కాపాడుకునేందుకు, తన గెలుపు కోసం శ్రమించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ జీవితం ప్రజాసేవకే అంకితమని, ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలం

పిచ్చాటూరు: కష్టకాలంలో నన్ను ఆదరించిన ప్రజల రుణం తీర్చుకుంటానని సత్యవేడు ఎమ్మెల్యేగా విజయం సాధించిన కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం పిచ్చాటూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయన ఓట్ ఆఫ్ థాంక్స్ కార్యక్రమం నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే జనం ఎన్డీఏ కూటమికి భారీ విజయం అందించారని అన్నారు. అవినీతి, అరాచకాలతో పాలన సాగించిన జగన్ వైసీపీ ప్రభుత్వ బాధితులు ఎదురు తిరుగుతుంటే ప్రజాస్వామ్యానికి ముప్పు అంటూ గగ్గోలు పెట్టడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, బాలరాజు, పద్దురాజు, వరలక్ష్మి, సుమాంజలి, వాసు, జయచంద్ర నాయుడు, బుజ్జినాయుడు, ప్రకాష్‌నాయుడు, చిన్న, రవి, అరుణ్ ప్రకాష్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అందరి కృషి ఫలితమే అఖండ విజయం

శ్రీకాళహస్తి, జూన్ 8: అందరి కృషి ఫలితమే ఈ అఖండ విజయమని ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ అన్నారు. శనివారం ఊరందూరులోని వారి స్వగృహం వద్ద కంతా సుబ్రహ్మణ్యం మిత్రబృందం కలిశారు. ఆమెను దుశ్శాలువాతో సన్మానించారు. అనిల్, హేమకుమార్, కిరణ్‌కుమార్, యుగంధర్, రవి పాల్గొన్నారు.





రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోలా ఆనంద్, ఉమేష్‌రావు తదితరులు

అక్షర యోధుడికి అశ్రునివాళి

శ్రీకాళహస్తి, జూన్ 8: ఈనాడు గ్రూప్ అధినేత రామోజీరావుకు శనివారం పలువురు నివాళులర్పించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కంతా రమేష్, చెంచయ్యనాయుడు, దశరధాచారి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే జయరామరావు వీధిలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

సత్యవేడు స్థానిక వీఎంకే కల్యాణ మండపంలో రామోజీరావు చిత్రపటానికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళులర్పించారు.

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నేతలు నిర్మల్‌కుమార్, మరదవాడ కుమార్, సురేష్‌రెడ్డి, పవన్, హరి, రమణయ్య, మునిభూషణమ్మ, జయచంద్రనాయుడు, శ్రీనివాసులునాయుడు నివాళులర్పించారు.

కేవీబీపురం: మండల కేంద్రంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులు నాయుడు నివాళులర్పించారు.గోపీనాథ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, బాలాజీ, మనోహర్, హరి, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు, ఈనాడు సిబ్బంది నివాళులర్పించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: రామోజీరావుకు టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మునెయ్య నాయుడు, మునిరాజా, శ్రీనివాసులు, పెంచలయ్య, భాస్కర్ యాదవ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం: మండల కేంద్రంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. భాస్కరన్, మాణిక్యంరెడ్డి, గోవిందస్వామి, ఊరప్ప, వేలు రెడ్డి, దొరవేలు రెడ్డి, మధి, ఆనంద్, కేఎఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

చాకలి మాన్యం భూమిలో అక్రమ కట్టడాన్ని ఆపండి

శ్రీకాళహస్తి, జూన్ 8: చాకలిమాన్యం భూమిలో అక్రమ కట్టడాన్ని ఆపాలని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి సంజాకుల మురళి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ తొట్టంబేడు మండలం రజకలులకు సంబంధించి సర్వే నెంబరు 77లో 14మిలో గల చాకలి మాన్యం భూమిని భూకబ్జాదారుల కబంధహస్తాల నుంచి కాపాడాలని బొజ్జల సుధీర్‌రెడ్డిని, తొట్టంబేడు మండల అధికారులను కోరారు. గత ప్రభుత్వ హయాంలో గత ప్రభుత్వ హయాంలో రజకులకు సంబంధించిన భూములను కొంత మంది కబ్జాదారులు అధికారులతో కుమ్మక్కై చాకలి మాన్యాన్ని అమ్ముకున్నారని, పలుమార్లు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రజకులు దుస్తులు ఉతుక్కోవడానికి గుంటలను, కాలువలను వెతుక్కుని ప్రాణాల మీదకు తెచ్చుకునే దుస్థితి ఏర్పడుతోందన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

వైభవంగా కళ్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, జూన్ 8: నారాయణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రబాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

భువనేశ్వరి ఆశీర్వాదం తీసుకున్న భాను



భువనేశ్వరితో భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూన్ 8: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఆశీర్వాదాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శనివారం అందుకున్నారు. హైదరా బాద్‌లో ఆమెను కలిసిన భానుప్రకాష్ ఎన్నికల్లో చంద్రబాబు సారధ్యంలో ఎన్‌డీఏ కూటమి సాధించిన ఘన విజయం పట్ల అభినందనలు తెలిపారు. నగరి నుంచి భారీ ఆధిక్యతతో గెలిచిన భానుప్రకాష్‌ను భువనేశ్వరి అభినందించి ఆశీర్వదించారు. నగరి ప్రజలకు సుపరిపాలన అందించాలని ఆమె సూచించారు.

రామోజీరావుకు నివాళి



రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు నిష్క్రమణ ప్రతికా రంగంతో పాటు యావత్ తెలుగు జాతికి తీరని లోటని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో రామోజీరావు పార్థివదేహానికి పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. తెలుగు ప్రజల గొంతుకగా ఈనాడును తీర్చిదిద్దడంలో రామోజీరావు చేసిన కృషి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమని భానుప్రకాష్ అన్నారు. ప్రజాసమస్యలను పత్రిక ద్వారా ప్రచారం కల్పించి వాటి పరిష్కారానికి మార్గం చూపడంలో ఆయన చేసిన కృషి శ్లాఘనీయమని కొనియాడారు.

అలాగే పుత్తూరులోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీలో అంతర్మథనం

భవిష్యత్తుపై బెంగ ● టీడీపీ గూటికి చేరేందుకు రాయబారాలు

పుత్తూరు అర్బన్, జూన్ 8: వైసీపీలో అంతర్మథనం మొదలైంది. టీడీపీ సాధించిన అసాధారణ విజయంతో వైసీపీ కేడర్ డోలాయమానంలో పడింది. తమ భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంది. టీడీపీ గూటికి చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకు ఆయా మండలాల్లో కీలక నాయకులతో టచ్‌లోకి వెళుతోంది.

రానున్న ఐదేళ్లు ఎలాగబ్బా...

రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికలకు ముందే ఒక్కొక్క కీలక నాయకుడూ పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నా, సంక్షేమ పథకాలు గెలిపిస్తాయనే నమ్మకం కొందరిలో ఉండేది. అయితే భానుప్రకాష్ 45,004 ఓట్ల మెజార్టీతో గెలిచాక గానీ రోజాపై నియోజకవర్గంలో ఇంత వ్యతిరేకత ఉందనే విషయం తెలియలేదు. దీంతో తమ భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంటున్నారు. గత రెండు ఎన్నికల్లో నగరి నుంచి వైసీపీ బొటాబొటీ మెజార్టీతో గెలిచింది. దీంతో వాపును చూసి బలుపనుకుని అధికారం ఉన్న ఐదేళ్లలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నారు. భవిష్యత్తును తలుచుకుని లోలోన కుమిలిపోతున్నారు. మరోవైపు రెండు రోజులుగా మండలాల వారీగా నగరిలో మాజీ ఎమ్మెల్యే రోజా ఫలితాలపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అండగా ఉంటానని భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కేడర్‌లో మాత్రం ఆత్మస్థైర్యం నింపలేకపోతున్నారు. ఐదేళ్ల వరకు టీడీపీతో రాజకీయ పోరాటం చేయగలమా అనే సందేహంలో పడిపోయారు.

టీడీపీతో రాయబారాలు

పుత్తూరు, నగరి మున్సిపాలిటీలకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు టీడీపీతో టచ్‌లోకి వెళుతున్నారు. గత ఐదేళ్లలో తాము టీడీపీ కేడర్‌ను ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని సంజాయిషీ ఇచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏ పరిస్థితుల్లో తాము వైసీపీలో కొనసాగాల్సి వచ్చిందనే విషయాలను ఏకరువు పెడుతున్నారు. టీడీపీ గూటికి చేరేందుకు లైన్ క్లియర్ చేయించమని అడుగుతున్నారు. అయితే ఎమ్మెల్యే భానుప్రకాష్ మనసు తెలిసిన టీడీపీ నాయకులు ఈ విషయాన్ని ఆయన ముందు ఉంచేందుకు మాత్రం సాహసించలేకపోతున్నారు. ఆయన వైఖరి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నాయకులు చేసిన దోపిడీపై విచారణ జరిపిస్తానని భానుప్రకాష్ ప్రకటించడం వారిలో గుబులు రేపుతోంది.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో శ్రీనివాసుడు

వడమాలపేట, జూన్ 8: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారుతలిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

పుత్తూరు, జూన్ 8: పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం శనివారం జరిగింది. తన కుమారుడి జన్మదినం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు శకుంతల రవికుమార్ 25 మంది వృద్ధులకు వస్త్రాలను వితరణ చేశారు. అనంతరం డాక్టర్ రవిరాజును, శకుంతల రవికుమార్, సంఘంలో కొత్తగా చేరిన విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు భాస్కరరాజు, యుగంధర్‌రాజు, కుప్పయ్య, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం

వడమాలపేట, జూన్ 8: స్థానిక భవానీ శంకర్ దేవాలయంలో మహాశివుని జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం చేశారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుద్రహోమం, శాంతి హోమం చేశారు. మహాశివుని లింగాన్ని పూలమాలలతో విశేషంగా అలంకరించి మంగళ హారుతలిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.